## వివిధ పుష్పాలంకరణ,బంగారు చీర అలంకరణతో బల్కంపేట ఎల్లమ్మ

**సంజీవరెడ్డి నగర్,అక్టోబర్ 28 ప్రభాతవార్త:**
బల్కంపేట ఎల్లమ్మపోచమ్మ దేవస్థానంలోని మూల విరాట్ అమ్మవారిని కార్తీక మాసం మంగళవారం సందర్భంగా వివిధ రకాల పుష్పలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఆలయ ప్రధాన అర్చకులు నీల్ కుమార్, రంగాచారిలు అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను, వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేఖర్, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఆలయ సిబ్బంది అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఎలాంటి అ సౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.


కార్తీక మాసం మంగళవారం సందర్భంగా పుష్పలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

హైదరాబాద్ వార్త



# భళా..బమ్రుక్‌నుద్దౌలా



- సుందరంగా రూపుదిద్దుకుంటున్న పాతబస్తీ చెరువు
- భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా హైడ్రా చర్యలు
- 18ఎకరాల విస్తీర్ణంగా వేగంగా అభివృద్ధి పనులు
- పటిష్టంగా ఇన్‌లెట్, ఔట్‌లెట్‌ల నిర్మాణాలు
- చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్..ప్లే ఏరియా
- వచ్చే నెలలో పనులు పూర్తి చేస్తామంటున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** పాతబస్తీలో చారిత్రక బమ్రుక్‌నుద్దౌలా చెరువు సర్వాంగ సుందరంగా సిద్ధమౌతోంది. నవంబరు నెలాఖరు నాటికి ఈ చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలనే లక్ష్యంతో హైడ్రా పని చేస్తోంది. ఈ క్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం పాతబస్తీలోని బమ్రుక్‌నుద్దౌలా చెరువు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువును జాతి సంపదగా భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు కేవలం 4.12 ఎకరాలకు పరిమితమైపోగా.. ఆక్రమణలను తొలగించి ఇప్పుడు చెరువును 18 ఎకరాల మేర వరద కట్టడితోపాటు.. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ముఖ్యంగా చెరువులోకి వరద నీరు చేరేలా.. నిండితే బయటకు పోయేలా నిర్మించిన ఇన్‌లెట్‌లు, ఔట్‌లెట్లను కమిషనర్ పరిశీలించారు. అలాగే చెరువు చుట్టూ బండ్ నిర్మించి వాకింగ్ ట్రాక్‌లు, కట్ట చుట్టూ ఫెన్సింగ్ నిర్మిస్తున్నారు. అలాగే చెరువు లోపలి వైపు ఎవరూ వెళ్లకుండా గట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు ఇరువైపులా ప్లే ఏరియాలు సిద్దం చేస్తున్నారు. అలాగే వృద్ధులు సేద దీరే విధంగా అక్కడ సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు పార్కులు ,, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. చెరువు చుట్టూ రహదారులు, గ్రీనరీని పెంచే విధంగా మొక్కలు, పచ్చిక బైళ్లను ఏర్పాటు చేస్తున్నారు.నాటి చారిత్రక ఆనవాళ్లను పరిరక్షిస్తూనే.. నగిషీలు చెక్కుతున్నారు. నిజాంల కాలంలో రాతితో నిర్మించిన బండ్‌ను చెక్కు చెదరకుండా కాపాడుతూ.. మరింత పటిష్టం చేస్తున్నారు. చెరువులో కూడా మట్టిలో కలిసిపోయిన నాటి రాళ్లను బయటకు తీసి భద్రపరుస్తున్నారు. స్థానిక నివాసితులు అక్కడకు వచ్చి సేదదీరేవిధంగా రూపొందించడమే కాకుండా.. సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నారు.



**చరిత్ర ఎంతో ఘనం..**

చార్ సౌ షహర్ హమారా..435 ఏళ్లకు పైబడిన చరిత్ర ఈ నగరానిది. అడుగడుగునా చారిత్రక ఆనవాళ్లు, ఎన్నో విశేషాలు మన సొంతం. అలాంటి కోవలోకే వస్తుంది.. 1770లో హైదరాబాదు మూడవ నిజాం సికందర్‌జాకు ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్‌ఉద్‌దౌలా నిర్మించిన బమ్రుక్నుద్దౌలా చెరువు. ఈ చెరువుకు సంబంధించిన సమాచారం స్థానికంగా ఉన్న వృద్ధులు పలు విధాలుగా వివరిస్తున్నారు. చారిత్ర ఆనవాళ్ల ప్రకారం వంద ఎకరాలకు పైగా ఈ చెరువు విస్తరించి ఉండేదని.. రాజేంద్రనగర్, ఆరాంఘర్, కాటేదాన్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ఈ చెరువుకు చేరేదని చెబుతున్నారు. నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్‌ను రాజులు, బమ్రుక్నుద్దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని చెబుతున్నారు. అలాగే బమ్రుక్నుద్దౌలా చెరువులో వన మూలికల చెట్లు, కొమ్మలు వేసి.. ఆ దిగువన నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని తాగేందుకు వినియోగించేవారని మరి కొంతమంది వివరిస్తున్నారు. ఔషధగుణాలున్న ఈ నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారంటున్నారు. అంతే కాదు.. ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని.. ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని.. ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లేవారంటున్నారు. ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు సంబర పడుతున్నారు.

## డీప్‌ఫేక్‌ల దాడి.. భద్రతకు కొత్త సవాలు

### -'సేఫ్ వర్డ్'..మోసాలపై ప్రభావవంతమైన రక్షణ

### -ప్రజలకు హెచ్చరిక జారీ చేసిన సీపీ సజ్జనార్

**హైదరాబాద్, అక్టోబరు 28 ప్రభాతవార్త**



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇప్పుడు మన జీవితంలోని ప్రతి కోణానికీ చేరింది. కానీ ఈ టెక్నాలజీ ఎంత శక్తివంతమైందో, అంతే ప్రమాదకరంగా కూడా మారుతోంది. ముఖ్యంగా డీపేఫేక్ టెక్నాలజీ ద్వారా మన ముఖం, మన గొంతును కూడా కచ్చితంగా నకిలీగా సృష్టించడం సాధ్యమైంది. ఇప్పుడు ఎవరికైనా మీ వీడియో లేదా వాయిస్‌ను వాడి, మీరు మాట్లాడుతున్నట్టుగా నకిలీ సందేశాలు పంపడం, వీడియోలు తయారు చేయడం లేదా కాల్స్ చేయడం సాధ్యమవుతోంది. దీంతో వ్యక్తిగత, ఆర్థిక మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా పలు దేశాల్లోనే కాకుండా మన దేశంలో కూడా డీప్ ఫేక్ ఆధారంగా మోసాలు జరుగుతున్నాయి. కొంత మంది మోసగాళ్లు మీ స్నేహితులు, బంధువులు, సహచరులు లేదా అధికారులుగా నటిస్తూ డబ్బు లేదా వ్యక్తిగత సమాచారం తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి మోసాలను గుర్తించడం చాలా కష్టంగా మారింది, ఎందుకంటే అవి నిజంగా ఉన్నట్లే కనిపిస్తాయి. ఇలాంటి మోసాల నుంచి రక్షణ పొందేందుకు ఒక సులభమైన కానీ అత్యంత ప్రభావవంతమైన పద్ధతి 'సేఫ్ వర్డ్'. అది మీరు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సహచరులతో మాత్రమే పంచుకునే ఒక ప్రత్యేక పదం లేదా సంకేతం. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వస్తే, ఆ వ్యక్తి నిజమా కాదా తెలుసుకోవడానికి ఆ 'సేఫ్ వర్డ్' అడగాలి. సేఫ్ వర్డ్ ఎలా ఉపయోగించాలంటే.. మీకు అత్యంత నమ్మకమైన వారితో ఒక ప్రత్యేక సేఫ్ వర్డ్ నిర్ణయించుకోండి. అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వచ్చినప్పుడు ఆ వర్డ్ అడిగి ధృవీకరించండి. ఆ సేఫ్ వర్డ్‌ను బయట ఎవరితోనూ పంచుకోకండి. బ్యాంక్ వివరాలు, ఒటిపిలు లేదా వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకండి. ఏఐ మన జీవితాన్ని సులభతరం చేస్తుంది, కానీ అదే ఏఐ మన భద్రతకు ప్రమాదం కావచ్చు. టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండటం, కొత్త మోసాలపై అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. 'సేఫ్ వర్డ్' వంటి చిన్న జాగ్రత్త పెద్ద ప్రమాదాల నుంచి మిమ్మల్ని కాపాడగలదు. ఇలాంటి మోసాలపై అవగాహన పెంచే ప్రయత్నంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఎక్స్ (ట్విటర్)లో ఒక హెచ్చరిక పోస్టు చేశారు."ఏఐ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో, అంతే జాగ్రత్త అవసరం" అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ భద్రత కోసం 'సేఫ్ వర్డ్' విధానం తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## విద్యార్థులకు మంత్రి సన్మానం


విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న అడ్లూరి లక్ష్మణ్. షబ్బీర్ అలీ, ఫహీముద్దీన్ ఖురేషీ, షఫియుల్లా తదితరులు.

**జూబ్లీహిల్స్, అక్టోబరు 28, ప్రభాతవార్తః** తెలంగాణ మైనార్టీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ విద్యార్థులు ఉన్నత కోర్సుల్లో ప్రవేశాలు పొందిన నేపథ్యంలో మంగళవారం బంజారాహిల్స్‌లోని కుమ్రం భీమ్ ఆదివాసి భవన్‌లో ఉడాన్-2025 పేరుతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. సోరింగ్ బియాండ్ డ్రీమ్స్ టువార్డ్స్ ఎక్సలెన్స్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఐఐటి, ఎన్ఐటీ తదితర ప్రతిష్టాత్మక కోర్సుల్లో ప్రవేశాలు పొందిన 50 మంది విద్యార్థులను ఆయన అభినందించి సన్మానించారు. వీరిలో 11 మంది ఐఐటీ, ఎన్ఐటీలో, 36 మంది ఎంబీబీఎస్‌లో, ముగ్గురు బీడీఎస్ కోర్సులో ప్రవేశం పొందారు. వీరికి ఆయన ల్యాప్‌టాప్‌లు, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్, మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, షఫీయుల్లా తదితరులతో కలిసి ఆయన టీఎంఆర్ఈఐఎస్ టైమ్స్ న్యూస్‌లెటర్‌ను ఇక్కడ విడుదల చేశారు.

## నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనులు, మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి : సిఎండి ఫరూక్



**జీడిమెట్ల, అక్టోబర్ 28, ప్రభాతవార్త :** రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనులు, లైన్ల మరమ్మతులు త్వరితగద్ర పూర్తి చేయాలని విద్యుత్ శాఖ సీఎం డి మహమ్మద్ అలీ ఫరూక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్,ఈ రవి కుమార్, డిఈ శ్రీనివాస్, ఏడి ఈ. ప్రేమ్ కుమార్‌తో కలిసి బస్తీ బాటలో పాల్గొని, సూరారంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సేవలందించేందుకు విద్యుత్ లైన్‌ల మరమతులు చేపడుతున్నామని అన్నారు. వేసవికాలంలో విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బస్తీబాటా కార్యక్రమంలో విద్యుత్ అధికారులు ప్రసూన సిబ్బంది పాల్గొన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి, అక్షరశిల్పి బ్నిం : రామ జోగయ్యశాస్త్రి


బ్నిం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రామ జోగయ్యశాస్త్రి, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, ఆదిత్య, వల్లీశ్వర్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, అక్టోబరు 28 ప్రభాతవార్త :** బహుముఖ ప్రజ్ఞాశాలి, అక్షరశిల్పి బ్నిం అని ప్రముఖ సినీగేయ రచయిత రామ జోగయ్యశాస్త్రి కొనియాడారు. హాస్యానందానికి, కార్టూన్లకు, ప్రత్యేక రచనలకు, రూపకాలకు, సరదా సరదా కార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఖ్యాతిగాంచిన బ్నిం పుట్టినరోజు సందర్భంగా అక్షజ్ఞ పబ్లికేషన్స్ వైభవోపేతంగా నిర్వహించిన సరదా సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో, హాస్యానందం, బాపురమణ అకాడమీ, సర్వత్ర ఫౌండేషన్, యువకళావాహిని సంయుక్త అభినందనలతో రవీంద్రభారతిలోని సమావేశ మందిరం ఈ వేడుకలకు వేదికైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ సినీగేయ రచయిత రామ జోగయ్యశాస్త్రి, సినీదర్శకుడు ఆదిత్య, వైద్యుడు డా. శిష్టా చంద్రశేఖర్, పింగళి వెంకటేశ్వరరావు, సింగం లక్ష్మీనారాయణ, సీనియర్ సంపాదకుడు వల్లీశ్వర్, శ్రీదేవి తదితరులు హాజరై ముందుగా బ్నింను ఘనంగా సత్కరించి ఆయన రచించిన అనగనగా బ్నిం కథలు, సెల్ఫీ రామాయణం పుస్తకాలతోపాటు అమ్మ మనస్సు పుస్తకాన్ని ఆవిష్కరించి శుభాభినందనలు తెలిపి ప్రసంగించారు. సభకు అక్షజ్ఞ వెంకట్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనగనగా పుస్తకాన్ని బ్నిం కుటుంబసభ్యులకు అంకితమిచ్చారు. సభకు ముందు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అబ్బురపరిచాయి.


సికింద్రాబాద్ నెక్లెస్ రోడ్డు వద్ద గల వాటర్‌ప్లాంట్ వద్ద చాట్ పూజలు నిర్వహిస్తున్న బీహారి సోదరులు


మొంథా తుఫాను ప్రభావంపై హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షం

## ఈ రోడ్డుకు మోక్షం లభించేనా?

- -రోడ్డు నిర్మాణానికి టెండర్ పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభం కానీ పనులు
- -అధికారుల ఉదాసీనత...కాంట్రాక్టర్ నిరక్ష్యంతో స్థానికులకు ఇక్కట్లు
- -రోడ్డు పనులు ప్రారంభించాలని అధికారులు,కాంట్రాక్టర్‌ను సంప్రదించినా ఫలితం శూన్యం
- -గుంతలు పడిన రోడ్డుతో నడిచేదేలా అంటూ ప్రశాంత్ కాలనీ వాసుల ఆగ్రహం


అధ్వానంగా తయరైన ప్రశాంత్ కాలనీ రోడ్ల దృశ్యం

**అత్తాపూర్ అక్టోబరు28,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలోని రోడ్డు నెంబర్ 9 లో సీసీ రోడ్డు నిర్మాణం కోసం జిహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసి ఏడాది పూర్తి కావస్తున్న నేటికీ ఈ రోడ్డుకు మోక్షం లభించక పోవడంతో స్థానికులు అధికారుల తీరు, కాంట్రాక్టర్ నిరక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయంగా మారిన ఈ రోడ్డులో నిత్యం రాకపోకలు సాధించే విద్యార్థులు వృద్ధులు ఇతరులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక ఈ ఏడాది వర్షాలు కూడా విస్తారంగా కురవడంతో ఈ రోడ్డంతా వరద నీటితో గుంతలు పడి బురదమయంగా మారీ రాకపోకలు సాగించాలని దుస్థితి నెలకొంది. పలుమార్లు స్థానికులు ఈ రోడ్డు దుస్థితిపై స్థానిక ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్, రాజేంద్రనగర్ సర్కిల్ అధికారుల దృష్టికి తెచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కార్లు, ఆటోలు అత్యవసర సమయంలో వచ్చే అంబులెన్సు కూడా రాలేక పోతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బడాబాబులు, రాజకీయ నాయకులు, ఇతర విఐపి ప్రాంతాల్లో మాత్రం అధికారులు ఆగమేఘాల మీద రోడ్ల నిర్మిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పేదలు సామాన్యులు ఉండే బస్తీలను ఏమాత్రం పట్టించుకోవడంలేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.


రోడ్డు నిర్మాణానికి టెండర్ పూర్తై 7 నెలలు కావస్తున్నా... ప్రారంభం కానీ రోడ్డు పనులు

ప్రశాంత్ కాలనీ రోడ్ నెంబర్ 9 లో సిసి రోడ్డు నిర్మాణం కోసం ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కాలనీ వాసుల తో కలిసి రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. అధికారులు రోడ్డు నిర్మాణం జరిగే వీధిని పరిశీలించి రూ. 25 లక్షల అంచనాలతో ఉన్నతాధికారులకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. చివరికి నిధులు మంజూరు కావడంతో ఎట్టకేలకు రూ. 15.2 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి టెండర్ పిలిచారు. ఈ టెండర్ లో గోగుల రాజు అనే కాంట్రాక్టర్ కు ఈ ఏడాది ఏప్రిల్ 19వ తేదీన ఈ సీసీ రోడ్డు పనులు దక్కాయి. అయితే ఏడు నెలలు గడిచినా జిహెచ్ఎంసి అధికారుల అలసత్వం... కాంట్రాక్టర్ నిరక్ష్యంతో నేటికీ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. ఈ రోడ్డు నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, కాలనీవాసులు పలుమార్లు అధికారులు, కాంట్రాక్టర్ ఫోన్ ద్వారా విచారిస్తున్న (అడుగుతున్నా ) ఇదిగో ప్రారంభిస్తున్నాం..అదిగో ప్రారంభిస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారని అధికారుల తీరు, సదరు కాంట్రాక్టర్ నిరక్ష్యంపై అసోసియేషన్ నాయకులు, కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు దక్కించుకున్న మూడు నెలల్లోపు రోడ్డు పనులను పూర్తి చేయాలానే నిబంధనలు ఉన్న కాంట్రాక్టర్ పూర్తిగా నిరక్ష్యం వహించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**పనిచేయని కాంట్రాక్టర్‌కు నోటీసు ఇస్తాం: ఏ ఈ**

శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం కోసం టెండర్ తగ్గించుకున్న కాంట్రాక్టర్ ను పనులు ప్రారంభించాలని పలుమార్లు కోరిన ఏవేవో సాకులు చెప్పి కాలయాపన చేస్తున్నాడని ఏఈ వేణుగోపాల్ తెలిపారు. అతనికి నోటీస్ ఇచ్చి ఈ పనిని రద్దు చేసి మళ్లీ టెండర్ పిలిచి వేరే వాళ్లకు అప్పగించి పనిచేయిస్తామన్నారు.

## భక్తిశ్రద్ధలతో కుబేర దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట

**సికింద్రాబాద్, అక్టోబర్ 28 ప్రభాతవార్తః** సికింద్రాబాద్ శ్రీనివాసనగర్ శ్రీగిరి పద్మావతి, గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కుబేర దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జీర్ణోద్ధరణ పూర్వక మహా సంప్రోక్షణ మహా కుంభాభిషేకంలో భాగంగా నాల్గవ రోజైన మంగళవారం వేద పండితుల నేతృత్వంలో సీతారామచంద్రస్వామి అభిషేకం, కుబేర దక్షిణామూర్తి, పరివారమైన గణపతి, శివలింగ, స్కంధమాత, నందీశ్వర, నవగ్రహ దేవతల మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్టాపన చేశారు. మూలమంత్ర హోమం, ధాన్యాధివాసం, యాగశాల, పూర్ణాహుతి, గంధ, పుష్ప అధివాసము తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బులుసు శివశంకరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 31వ తేదిన జీర్ణోద్ధరణ పూర్వక మహా సంప్రోక్షణ మహా కుంభాభిషేకం నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి భక్తులకు స్వామివారి సర్వదర్శనం అందుబాటులోకి తేనున్నట్లు ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, తమ్మన వేణుగోపాల రావులు తెలిపారు. పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలు, భక్తులు ఆలయ పునర్నిర్మాణం, మహా సంప్రోక్షణ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


దక్షిణామూర్తి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## చర్చి నిర్మాణంతో సమాజానికి మేలు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



చర్చి శంఖుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** చర్చి నిర్మాణంతో సమాజానికి ఆధ్యాత్మికంగా, సామాజికంగా మేలు జరుగుతుందని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం అంబర్‌పేట్‌లో సెయింట్ ఫ్రాన్సిస్ సేవియర్ చర్చి నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన కార్పోరేటర్ విజయ్ కుమార్‌గౌడ్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఎమ్మెల్యే, కార్పోరేటర్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

## విజయానికి క్రమశిక్షణ, సహనం అవసరం




బాగ్‌లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ సియోలేకర్, డాక్టర్ సరోజ వివేక్ తదితరులు

**చిక్కడపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త:** విజయానికి క్రమశిక్షణ, సహనం, లక్ష్యపూర్వక నాయకత్వం చాలా అవసరమని ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ సియోలేకర్ అన్నారు. మంగళవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థలో ఎంబీఏ బీబీఏ విద్యార్థులతో"ది అనాటమీ ఆఫ్ సక్సెస్: డిసిప్లిన్, డీటైల్ అండ్ లెగసీ బిల్డింగ్" అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ జి. సరోజా వివేక్ , సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి , డైరెక్టర్ వై. విష్ణుప్రియ, ఎంబీఏ ప్రిన్సిపాల్ అన్జన్ కుమార్ , లా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన పాల్గొన్నారు. క్రీడల ద్వారా నేర్చుకున్న విలువలు వ్యాపారంలో కూడా ఎలా ఉపయోగపడతాయో వివరించారు. అనంతరం లా కాలేజ్ విద్యార్థులతో"ఎథిక్స్ అండ్ లా ఇన్ ఆంత్రప్రెన్యూర్షిప్" అనే అంశంపై ఆయన మాట్లాడారు. వ్యాపారంలో న్యాయపరమైన వ్యవస్థలు, జాగ్రత్తపూర్వక పరిశీలన, మరియు నైతిక విలువలు ఎంత ముఖ్యమో వివరించారు. రియల్ ఎస్టేట్ రంగంలో రిస్క్ మిటిగేషన్ , కంప్లయెన్స్, నియంత్రణ సంస్థలతో అనుసంధానం, మరియు న్యాయపరమైన క్రమశిక్షణ ద్వారా విశ్వసనీయమైన వ్యాపారాన్ని ఎలా నిర్మించవచ్చో ఆయన వివరించారు. ఎంబీఏ, లా కళాశాల విద్యార్థులు వేసిన ప్రశ్నలకు సియోలేకర్ సమాధానాలిచ్చారు.

## డా.జె.చెన్నయ్యకు కళావిపంచి పురస్కార ప్రదానం



కళావిపంచి పురస్కారంతో డా. జె.చెన్నయ్యను సత్కరిస్తున్న గోపాలకృష్ణ, నరసింహారావు, రఫీ తదితర అతిథులు

**నాంపల్లి, అక్టోబరు 28 ప్రభాతవార్త :** హైదరాబాద్‌కు చెందిన కళావిపంచి సంస్థ తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్యకు ప్రతిష్ఠాత్మక కళావిపంచి పురస్కారం ప్రదానం చేసింది. ఈమేరకు కంచి కామకోటి పీఠంలోని పద్మావతి కళామందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై చెన్నయ్యకు కళావిపంచి పురస్కారం ప్రదానం చేసి నాటక రంగానికి సంబంధించిన కళాకారుల జీవన చిత్రాలు రూపొందించి భద్రపరచాలని, అవి భావితరాలకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు. అలాగే తెలుగు నాటక సమగ్ర చరిత్ర రచించాల్సి ఉందని పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు, ప్రముఖ రంగస్థల కళాకారుడు బొప్పన నరసింహారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గోపాలకృష్ణ విశిష్ట అతిథులు కళాపత్రిక సంపాదకుడు డా. మహ్మద్‌రఫీ, నరసింహారావు తదితర నాటక రంగ ప్రముఖులతో కలిసి జె.రాధాకృష్ణరావు, జి.మల్లికార్జున్ రావులను సన్మానించి ఆత్మీయ పురస్కారాలను అందించి అభినందించారు. సభకుముందు ఉషోదయ సంస్థ వారు దేశభక్తి ఇతివృత్తంగా ప్రదర్శించిన గారడి నాటిక వీక్షకుల్లో దేశభక్తిని పెంపొందించింది.

## బ్యాడ్మింటన్‌లో రాణించిన డిపిఎస్ విద్యార్థులను అభినందించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 28:** క్రీడా రంగంలో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రానికి గౌరవాన్ని తెచ్చారని బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. హైదరాబాద్‌లోని చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన అండర్13 జాతీయ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కి చెందిన 7వ తరగతి విద్యార్థిని సహస్ర, డబుల్స్ విభాగంలో బంగారు పతకం, సీబీఎస్సీ జాతీయ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ (క్లస్టర్స్)లో కాంస్య పతకం గెలుచుకున్న అన్యను మంగళవారం డీపీఎస్ సీఈఓ మల్కా యశ్వసీ, బ్యాడ్మింటన్ కోచ్ హర్షతో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. తనను కలిసిన యువ క్రీడాకారిణుల ప్రతిభను మంత్రి ప్రశంసిస్తూ, తెలంగాణ రాష్ట్రం నుంచి ఇలాంటి ప్రతిభావంతులు వెలుగులోకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడా రంగంలో మరింత రాణించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత నిస్తూ విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న డిపిఎస్ యాజమాన్యాన్ని మంత్రి ప్రశంసించారు. విద్యార్థినుల విజయాలు పాఠశాలతోపాటు రాష్ట్రానికి గర్వకారణమని మంత్రి అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించాలని విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.

## చార్మినార్ మహాదేవ్ మందిరంలో అంకుట్ ప్రసాద్



అంకుట్ ప్రసాద్‌లో పాల్గొన్న చార్‌కమాన్ జెవెల్లర్స్, షరాఫా అసోసియేషన్ ప్రతినిధులు అజయ్ కుమార్ అగర్వాల్, గోవింద్ ప్రసాద్ గుప్తా

**చార్మినార్, అక్టోబరు 28 ప్రభాతవార్త :** కార్తీక మాసం సందర్భంగా చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరంలో అంకుట్ ప్రసాద్ కార్యక్రమం జరిగింది. చార్మినార్ సమీపంలో పురాతనమైన చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరం ఉంది. ప్రతీ రోజు భక్తులు మహాదేవ్ మందిరంలో శ్రీ పరమ శివునికి ఎంతో భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహిస్తారు. కాగా కార్తీక మాసం సందర్భంగా మందిరంలో జరిగిన అంకుట్ ప్రసాద్ కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. ప్రతీ సంవత్సరం కార్తీక మాసం మొదటి సోమవారం రోజున చార్మినార్ శ్రీ మహాదేవ్ మందిరంలో అంకుట్ ప్రసాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మందిరం కమిటి ప్రతినిధి, చార్‌కమాన్ జెవెల్లర్స్, షరాఫా అసోసియేషన్‌ప్రతినిధి అజయ్ కుమార్ అగర్వాల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గోవింద్ ప్రసాద్‌గుప్తా, అనిల్ అగర్వాల్ పలువురు పాల్గొన్నారు.

## సంగీత నృత్య పోటీలకు ప్రభుత్వ ఉద్యోగులకు ఆహ్వానం : డా. ఏనుగు నరసింహారెడ్డి

**రవీంద్రభారతి, అక్టోబరు 28 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ సంగీత, నృత్య పోటీలకు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వం తరపున డా. బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఆధ్వర్యంలో జరిగే పోటీలలో పాల్గొనడానికి సంగీతం, నృత్యం మరియు క్రింద పేర్కొన్న అంశాలలో నైపుణ్యం ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుండి దరఖాస్తులను వాట్సప్ ద్వారా కోరుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి నవంబరు 6, 7 తేదీలలో రవీంద్ర భారతిలో పోటీలు నిర్వహించి ఎంపిక చేయబడతాయని పేర్కొన్నారు.

**అంశాలు :** హిందూస్తానీ గాత్ర సంగీతం; కర్ణాటక గాత్ర **సంగీతం;** పాశ్చాత్య గాత్ర సంగీతం; జానపద గీతాలు **సోలో;** జానపద గీతాలు -బృందగానం; వివిధ వాయిద్య **సంగీతం;** వివిధరీతుల్లో నృత్యం; జానపద బృంద **నృత్యం;** లఘునాటిక. వివిధ విభాగాలలో పాల్గొనే పోటీదారులు ఆయా దరఖాస్తులను విభాగాల వారీగా క్రింద సూచించిన వారికి వాట్సప్ ద్వారా అక్టోబరు 29 నుండి నవంబరు 1వ తేదీలోగా సమర్పించవలసినదిగా కోరారు.

**సంగీతం : ఎన్.సుధీర్‌కుమార్ :** 9849641839
**నృత్యం : నీరజాక్షి** : 9704466499
**వాయిద్యాలు : అయేషా** : 9948611766
**లఘునాటికలు : బి.శ్రీశైలం** : 9959667703

**ఎంపిక తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే**

వాట్సప్‌లో దరఖాస్తు వివరాలు : పేరు; హోదా; వయస్సు; శాఖ మరియు కార్యాలయం; పాల్గొనే అంశం మరియు నిర్ణీత సమయం వివరాలు పొందుపరచాలి. ఏమైనా సందేహాలు ఉంటే పూర్తి వివరాలకు : యామిని కనకతార, జాయింట్ సెక్రటరీ (కల్చరల్). డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయ సంఘం - 830939 5375; ఎన్.సుధీర్‌కుమార్ : 9849641839లలో సంప్రదించవచ్చునను రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు పేర్కొన్నారు.

## దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలి : వెంకటస్వామి మాదిగ



మెహిదీపట్నం డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు.

**మెహిదీపట్నం అక్టోబర్ 28, ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నవంబర్ 1న హైదరాబాద్ నగరంలో తలపెట్టిన దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం డివిజన్ అంబేద్కర్ నగర్ లోని కమ్యూనిటీ హాల్ లో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఇంజం వెంకటస్వామి మాదిగ హాజరై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ పై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. ఎన్నో కేసులను సుమోటోగా స్వీకరించిన పోలీసులు ఈ దాడిని ఎందుకు సుమోటోగా స్వీకరించడం లేదని ప్రశ్నించారు. సంఘటన జరిగి 22 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడం లేదన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితుల పరిస్థితి ఊహించలేనిదన్నారు. చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడిని నిరసిస్తూ నవంబర్ 1న లక్షలాది మంది తో ఛలో హైదరాబాద్ దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు, ఈ ర్యాలీకి లక్షలాదిమంది దళితులు హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు, నాంపల్లి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ గజ్జల రాజశేఖర్ మాదిగ నాయకులు చౌట రమేష్ మాదిగ, ఇరికి శంకర్ మాదిగ, ఊలకోలు రేణుక మాదిగ, చింతకుంట్ల సత్యం మాదిగ, కావాలి శ్యామ్ ముదిరాజ్, పసుపు కిషోర్ కుమార్ మాదిగ, దాసరి సుధాకర్ మాదిగ, బొప్పి గణేష్ మాదిగ, షమ్మీ నరసింహ మాదిగ, వెంకటయ్య మాదిగ, లోకనాథం మాదిగ, కుమ్మరి నరసింహ, సమ్మె వీరు మాదిగ, ఎర్రోళ్ల యాది మాదిగలు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యంను అందించడమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌దర్గాలో బస్తీ దవాఖానాను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

**నార్సింగి, అక్టోబర్ 28 ప్రభాతవార్త :** పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ దర్గా వద్ద "బస్తీ దవాఖానా"ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలలోనే బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి, వారికి సత్వర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పూర్తి ఉచితంగా అన్ని రకాలు వైద్య సేవలను ఈ బస్తీ దవాఖానాల్లో పేదలకు అందించడం జరుగుతుందన్నారు. రోగులకు ఉచితంగా పరీక్షలు, వైద్యం, మందులు అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ బస్తీ దవాఖానా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. బండ్లగూడ కార్పోరేషన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు నిరంతరం పని చేస్తున్నామని వివరించారు. విద్య, వైద్యం, మౌళిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్ర, సహకార సంఘం ఛైర్మన్ రాందాస్ ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ కార్పోరేటర్లు సాగర్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, అస్లాం, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, నాయకులు సురేష్‌గౌడ్, సంగారెడ్డి, సుమన్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలకు త్వరలో చెక్ : కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



అశోక్ నగర్, ఎస్బిహెచ్ కాలనీ లో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్న స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త:** అశోక్ నగర్, ఎస్బిహెచ్ కాలనీ వాసుల సమస్యలు పరిష్కరిస్తామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం తో పాటు పరిసర ప్రాంతాల్లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానిక కాలనీ వాసులు ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వినోద్ ,అశోక్ నగర్ ఎ.ఈ, గోపాలకృష్ణ, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్ కుమార్తో కలిసి ఆయా ప్రాంతాలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ లో ఏర్పాటు చేసిన ఆర్ ఏం యూ బాక్స్ లో ఏర్పడ్డ సాంకేతిక లోపం వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలుకొని, అడిషనల్ డివిజనల్ ఇంజనీర్ నెహ్రూ నాయక్తో ఫోన్ లో మాట్లాడారు, వెంటనే సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ సూచించడంతో సమస్య త్వరితంగా పరిష్కారం అయ్యేందుకు వీలుగా మూడు రోజులో పరిష్కరిస్తామని అధికారులు వివరించారు. కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, నాయకులు శివ కుమార్, సాయి కుమార్, రఘు యాదవ్, అభిషేక్, సంయుక్త రాణి మరియు స్థానిక కాలనీ వాసులు నాగరాజ్, హాన్స్ రాజ్, విఠల్ రావు, వెంకటేశం, శ్యామ్ సుందర్, రమణ, సురేష్, సంగీత తదితరులు పాల్గొన్నారు.

## తొలి తెలుగు నేపథ్య గాయని రావు బాలసరస్వతి



తొలి తెలుగు నేపథ్య గాయని రావు బాలసరస్వతి నివాళి కార్యక్రమంలో పాల్గొన్న వోలేటి పార్వతీశం, కలగా కృష్ణ మోహన్, విన్నకోట మురళి కృష్ణ, సురేఖ మూర్తి తదితరులు

**చిక్కడపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త:** మోహన్ మెలోడీస్ నిర్వహణలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ఇటీవల మృతి చెందిన తొలి తెలుగు నేపథ్య గాయని రావు బాలసరస్వతి కి సంగీత స్వర నివాళి కార్యక్రమం మోహన్ మెలోడీ అధినేత కలగా కృష్ణమోహన్ నిర్వహణలో జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ ఆకాశవాణి లో లలిత గీతాలు సాలూరి రాజేశ్వరరావు తో కలిసి. బాల సరస్వతి గానం చేసి ప్రాచుర్యం కలిగించిన ప్రతిభా గాయని అని పేర్కొన్నారు. కిన్నెర రఘురాం, రసమయి డాక్టర్ యం కె రాము, రావు బాల సరస్వతి కుమారుడు సూర్య రావు, సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ, సంగీత స్వరకర్త విన్నకోట మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహక సంస్థ స్థాపకుడు కలగ కృష్ణ మోహన్ సారధ్యం. వహించగా ప్రముఖ లలిత, సినీ గాయని గాయకులూ వినోద్ బాబు, శశి కళ స్వామి, సురేఖ, దుర్గ, హిమ బిందు, మాధవి, బాల కామేశ్వర రావు, చింతలపాటి సురేశ్ల, లక్ష్మణ్, నాగేశ్వర రావు తదితరులు బాల సరస్వతి , ఎస్ రాజేశ్వర రావు, ఘంటసాల తో కలసి పాడిన పాటలు మధురం గా ఆలపించారు.

## నవీన్ యాదవ్‌పై అసత్య ఆరోపణలు చేసే నాయకులకు బుద్ధిచెబుతాం

**బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్**




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న నరేందర్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 28, ప్రభాతవార్త:** బీసీలబిడ్డ నవీన్ యాదవ్ పై పార్టీలకు అతీతంగా అగ్రకులాల ఏకమై విషం కక్కుతున్నారని అలాంటి పార్టీ నాయకులకు తగిన బుద్ది చెబుతామని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ హెచ్చరించారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవీన్ యాదవ్ కుటుంబసభ్యులు రౌడీ అని విమర్శిస్తున్న నాయకులు కేసీఆర్, కేటీఆర్, కవితల పై ఉన్న ఆరోపణలకు ఏం సమాధానం చెబుతారన్నారు. లిక్కర్ కేసులో కవిత జైలుకు సైతం వెళ్ళిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే బిజెపి కిషన్ రెడ్డి పైనా అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. నవీన్ యాదవ్ గెలుపు పక్క అని సర్వే రిపోర్టులు వచ్చాయని అందుకే నవీన్ యాదవ్ ను ఎలాగైనా ఓడగొట్టాలని కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన మాగంటి కుటుంబంపైనా అనేక ఆరోపణలు ఉన్నాయని అవన్ని నిజమేనా అని ప్రశ్నించారు. మాగంటి గోపీనాథ్ కుట్రలు చేసి నవీన్ యాదవ్ పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టారని గుర్తుచేశారు. ఏదిఏమైనా బిసి బిడ్డపై విషప్రచారాలు మానకుంటే తగిన బుద్ది చెబుతామని నరేందర్‌గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎర్ర శ్రీహరి గౌడ్, దుగ్గని శ్యామల ముదిరాజ్, గిరగాని భిక్షపతి, కడబోయిన మల్లేష్ యాదవ్,ఎర్రం సంజీవ , దొంగ్ల శ్రీనివాస్ పులియ గారి సరితా అంబాదాస్ , జ్యోతి గౌడ్ , సంతోషి మాత నర్సింలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## జంటసర్కిళ్లలో అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి: కొండల్‌రెడ్డి




జోనల్ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న బద్దం కొండల్‌రెడ్డి

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 28 ప్రభాతవార్త.** శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలోని జంట సర్కిళ్లలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు దృష్టిసారించి, చర్యలు తీసుకోవాలని మదర్ సేవా సమితి అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి డిమాండ్‌చేశారు. ఈ మేరకు శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌కాలనీ చుట్టూ ప్రాంతాలలోని సుదర్శన్‌నగర్, రాఘవేంద్రకాలనీ, రాజరాజేశ్వరీకాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, కొండాపూర్, కొత్తగూడ, మాదాపూర్, నందిహిల్స్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ, ఖాజాగూడ, గోపన్‌పల్లి, నల్లగండ్ల తదితర ప్రాంతాలల్లో 50,100,200 గజాల స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. వాహనాలను నిలిపేందుకు స్థలం కూడా లేకుండా ఇంటి నిర్మాణాలకు అనుమతులు తీసుకుని పలువురు 5ఫ్లోర్ల నుంచి 7ఫ్లోర్ల వరకు అక్రమంగా నిర్మాణాలు చేసి పలు రకాల షోరూంలకు, స్కూళ్లు, కళాశాల, హాస్టళ్లకు అద్దెకు ఇస్తున్నారు. అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై వాటిని కూల్చకుండా సీజ్ చేయకుండా టౌన్‌ప్లానింగ్‌లోని కొందరు అధికారులు లంచాలు తీసుకుంటూ అక్యూపెన్సీ సర్టిఫికెట్లు ఇచ్చి అక్రమ నిర్మాణదారులను పెంచి పోషిస్తూ లక్షల రూపాయలను వసూలు చేస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణాలతో కాలనీల్లో స్కూళ్ల బస్సులకు, అంబులెన్స్‌లకు, ఇతర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అదే విధంగా చందానగర్ సర్కిల్ పరిధిలోని చందానగర్, గంగారం, మియాపూర్ డివిజన్లలోని పలు ప్రాంతాలలోనూ, హుడాకాలనీ, మదీనాగూడ, హఫీజ్‌పేట్ సర్వేనంబర్ 80, గోకుల్ ప్లాట్స్, అయ్యప్పసొసైటీ, ఖానామెట్, ఇజ్జత్‌నగర్ తదితర ప్రాంతాలల్లో 100,200 గజాలల్లో జీప్లస్ 2 ఇంటి నిర్మాణాలకు అనుమతులు తీసుకుని 5 ఫ్లోర్లు, 7ఫ్లోర్లు వరకు అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ లంచగొండి టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిని నిర్మూలించలేకపోతున్నారన్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ద తీసుకుని అక్రమ నిర్మాణదారులపై అక్రమాలకు పాల్పడిన టౌన్‌ప్లానింగ్ అధికారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం మంత్రిని కలిసిన చైర్మన్

**- అజీజ్‌నగర్‌కు మార్కెట్‌ను తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన మంత్రి**



గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావ్‌ని కలిసిన చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్.

**నార్సింగి, అక్టోబర్ 28 ప్రభాతవార్త :** గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరుతూ మంగళవారం చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్‌ను ఆధునీకరించేందుకు నిదులు మంజూరు చేయాలని, అన్నదాతల ఆర్థికాభివృద్ధికి మరిన్ని సేవలు మార్కెట్‌లో ప్రారంభించాలని మంత్రిని కోరామన్నారు. దశాబ్దాల కాలంగా రంగారెడ్డి జిల్లాలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు చెందిన రైదులు తమ పొలాల్లో పండించిన తాజా కూరగాయలను నేరుగా గుడిమల్కాపూర్‌కు తీసుకు వచ్చి వినియోగదారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. నగరంలోని ప్రజలు సైతం తాజా కూరగాయలు తక్కువ ధరకే లభిస్తుండడంతో ఈ మార్కెట్‌ను ఆదరించారన్నారు. మధ్య దలారీ వ్యవస్థకు చెక్ పెడుతూ అటు రైతులు, ఇటు వినియోగదారులు ఇద్దరి ప్రయోజనార్థం వ్యవసాయ మార్కెట్ సేవలు అందించిందన్నారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్‌ను ఆధునీకరించాలని మంత్రిని కోరామన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్ ఈ మార్కెట్‌ను గుడిమల్కాపూర్ నుంచి అజీజ్‌నగర్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారన్నారు. అజీజ్‌నగర్‌లో అత్యాధునిక భవనాలు నిర్మించి, ఆధునిక, కార్పోరేట్ స్థాయి సేవలను అన్నదాతలకు అందించేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని వివరించారని మల్లేష్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డైరెక్టర్లు మునీర్, శంకర్, మధుసూదన్‌రెడ్డిలు ఉన్నారు.

## ఆల్విన్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్



సాయి నగర్‌లో అక్రమంగా నిర్మించిన భవనంపై సెల్ టవర్ ఏర్పాటు చేసిన దృశ్యం

**కూకట్‌పల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్లోని సాయి నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్ ఏర్పాటు కావడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాయి నగర్‌లోని ప్లాట్ నెంబర్ 71 ఇంటి నెంబర్ 46 137/డబ్ల్యూ లో సదరు నిర్మాణదారుడు ఎలాంటి సెట్ బ్యాగ్ లేకుండా నాలుగు అంతస్తుల బహుళ అంతస్తులు భవనాన్ని నిర్మించాడు. అంతేకాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణంపై ఎయిర్ టెల్ టవర్‌ను నిర్మించడంతో చుట్టుపక్కల ప్రాంతాల వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ టవర్ ఏర్పాటు చేయడం వల్ల పరిసర ప్రాంతవాసులైన చిన్న పిల్లలకు గర్భిణీ స్త్రీలకు వృద్ధులకు పలు రకాల అనారోగ్య పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా భవనంపై ఏర్పాటు చేసిన ఎయిర్టెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని కోరుతూ పరిసర ప్రాంతాలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు మున్సిపల్ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన బహుళ అంతస్తుల భవనంపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

## చింతల్‌లో ట్రాఫిక్‌జాం నియంత్రణకు చర్యలు చేపట్టకపోతే ఆందోళన : ప్రతాప్



కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యుటీ కమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మాకు వివతిపత్రం సమర్పిస్తున్న రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్‌మాజీ అధ్యక్షులు కె.ఎం.ప్రతాప్

**కుత్బుల్లాపూర్, అక్టోబరు 28 ప్రభాతవార్త** చింతల్ పరిధిలోని పలు ప్రధానకూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని రంగారెడ్డిజిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు కె.ఎం.ప్రతాప్ విజ్ఞప్తిచేశారు. మంగళవారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వడ్డేపల్లినర్సింహ్మాకు విపతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ చింతల్ మెయిన్‌రోడ్డులోని పాత గ్రీన్ హోటల్ గల్లి నుండి ఎల్లమ్మ దేవాలయం, సహారా హోటల్, మీదుగా అంబేద్కర్ నగర్ వైపు వెళ్లే రోడ్డునిత్యం ట్రాఫిక్‌రద్దీతో ప్రజలు , వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రాణాపాయ స్థితినుండి ప్రజల్ని కాపాడే అంబులెన్స్‌లు కూడా పోలేని పరిస్థితి వుందని దీనిని పరిగణలోకి తీసుకుని ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాలను గుర్తించి కొత్తరోడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని సూచించారు. కుత్బుల్లాపూర్ గ్రామ పరిధిలోని విమాన్‌పురి కాలనీలో సెల్‌టవర్లతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణం సెల్‌టవర్ల రేడియేషన్‌లతో ప్రజలు సతమతమవుతున్నారని వాటిపై కూడా తక్షణచర్యలు చేపట్టాలని సూచించారు. విచ్చలవిడిగా సెల్‌టవర్లను ఏర్పాటుచేసుకున్న వ్యాపారులకు ఎన్‌ఓసిగానీ, ఆక్యుపెన్సిగానీ లేవని వాటిని గుర్తించి తక్షణచర్యలు చేపట్టి వాటిని తొలగించాలని కె.ఎం. ప్రతాప్ డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో విమాన్‌పురి సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఒక్కరోజు సోషల్ సర్వీస్ చేయమని కోర్ట్ తీర్పు

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త** నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయంలో హోటల్ నడుపినందుకు ఓ ఇద్దరికి హైకోర్టు సామాజిక సేవ చేయాలనీ తీర్పునిచ్చింది. పేట్ బషీరాబాద్ పరిధిలో సుచిత్ర సర్కిల్‌లో వున్నటువంటి మై ఫ్రెండ్ సర్కిల్ హోటల్, లక్కీ రెస్టారంట్, హోటళ్లు రాత్రి సమయంలో సమయాన్ని మించి తెరిచి ఉంచినందున, ఎస్ హెచ్ ఓ పేట్ బషీరాబాద్ పోలీసులు వాటిపైన కేసు నమోదు చేసి స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్ట్ కు తరలించారు. జడ్జి ఆ హోటళ్ల యజమానులైన మహమ్మద్ హాది, మహమ్మద్ రషీద్‌లకు ఒక్క రోజు సమాజ సేవ (సోషల్ సర్వీస్) చేయమని తీర్పు ఇవ్వడం జరిగింది.

## బస్తీ బాటలో విద్యుత్ సమస్యలు పరిష్కారం : చార్మినార్ ఏఈ మహమూద్



మామాజుమ్లాపాఠక్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పరిశుభ్రం చేస్తున్న చార్మినార్ విద్యుత్ సిబ్బంది

**చార్మినార్, అక్టోబరు, 28 ప్రభాతవార్త :** బస్తీ బాట కార్యక్రమంలో విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు మహమూద్ అన్నారు. ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని మామాజుమ్లా పాఠక్‌లో జరిగిన బస్తీబాటలో చార్మినార్ విద్యుత్ సెక్షన్ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చార్మినార్ ఏఈ మహమూద్ మాట్లాడుతూ ప్రతీ మంగళ, గురు, శని వారాలలో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలోనే వీలైనంత వరకు పరిష్కరిస్తున్నామని ఆయన తెలియజేశారు. ప్రజలు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలపై బస్తీ బాటలో తెలియజేయవచ్చునని ఆయన తెలిపారు. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మామాజుమ్లా పాఠక్‌లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోపల, బయట ఆవరణలోని చెత్తా చెదారాన్ని తొలగించామని చార్మినార్ విద్యుత్ సెక్షన్ లైన్‌మెన్ మంగారావు తెలిపారు. ప్రజలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎటువంటి ప్లాస్టిక్ కవర్లు, చెత్తను వేయవద్దని ఆయన కోరారు. బస్తీ బాట కార్యక్రమంలో చార్మినార్ విద్యుత్ సెక్షన్ ఫోర్‌మెన్ బి.రామస్వామితో పాటు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా బస్తీ బాటలో విద్యుత్ లోఓల్టేజి సమస్యలతో పాటు పలు సమస్యలకు సంబంధించిన సమస్యలపై వినియోగదారులు నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.

## కెటిఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన బొబ్బ నవతారెడ్డి

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 28 ప్రభాతవార్త** శేరిలింగంపల్లి నియోజక వర్గంలో బీజేపీ క్రియాశీలక నేతగా పనిచేసిన చందానగర్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఆపార్టీకి రాజీనామా చేసి తాజాగా గులాబి గూటికి చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నవంబర్ 2వ తేదిన ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్ పార్టీలో భారీ ఎత్తున చేరేందుకు ముహుర్తం ఖరారు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులను కలుపుకుంటూ బీఆర్ఎస్ పార్టీకి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పూర్వవైభవాన్ని తీసుకువచ్చే విధంగా నవతారెడ్డి రంగం సిద్దం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో నవతారెడ్డి, ఆమె తండ్రి బొబ్బ విజయారెడ్డిలు కలువటం ప్రాధాన్యత సంతరించుకుంది. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేసేందుకు దృఢనిశ్చయంతో పనిచేయాలని కేటీఆర్ సూచించినట్లు నవతారెడ్డి తెలిపారు. చందానగర్ డివిజన్ కార్పొరేటర్‌గా బీఆర్ఎస్‌నుంచి గెలుపొందిన నవతారెడ్డి అదే స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని, నియోజక వర్గంలో గులాబి జెండాను ఎగురవేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

## నవంబర్ 1 నుంచి గురునానక్ 556 జయంతి ఉత్సవాలు



గురునానక్ జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభందక్ కమిటి ప్రతినిధులు

**అఫ్జల్‌గంజ్,అక్టోబర్ 28 ప్రభాతవార్త:** సిక్కు గురువు గురునానక్ 556 జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నవంబర్ 1 నుంచి 5 వ తేది వరకు సంకీర్తనలు,నగరకీర్తనలు,శోభయాత్రను నిర్వహించడం జరుగుతుందని అఫ్జల్‌గంజ్ గురుద్వారా ప్రతినిధులు సత్యేందర్‌సింగ్ బగ్గా,బల్‌దేవ్‌సింగ్‌బగ్గా, జస్పాల్‌సింగ్ తుటేజా, జగ్‌మోహన్‌సింగ్, హరిప్రీత్‌సింగ్‌లు తెలిపారు.మంగళవారం అఫ్జల్‌గంజ్‌లోని గురుద్వారాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ నవంబర్ 1వ తేదిన సికింద్రాబాద్ గురుద్వారా శోభయాత్ర జరుగుతుందన్నారు.నవంబర్ 3వ తేదిన అఫ్జల్‌గంజ్ గురుద్వారా నుంచి గురునానక్ జయంతి శోభయాత్ర సాయంత్రం 4గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు.శోభయాత్రలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సిక్కులు కుటుంబసమేతంగా విచ్చేసి అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు.5వ తేది నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో విశాల్‌దీవన్, సంకీర్తన కార్యక్రమాలను నిర్వహించడంజరుగుతుందన్నారు. విశాల్‌దీవన్ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడంతోపాటు వచ్చే భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.సిక్కు గురువులు శ్రీనగర్‌కు చెందిన బాయ్ హరిందర్‌సింగ్‌జీ,యు.ఎ.ఎస్‌కు చెందిన బాయ్ బల్‌జీత్‌సింగ్,జ్ఞానీ సాహెబ్‌సింగ్‌జీ,జగ్‌దేవ్‌సింగ్‌జీ,బాయ్ హర్వేందర్ సింగ్‌లు విచ్చేయనున్నట్లు తెలిపారు.ఈసమావేశంలో సిక్కు ప్రతినిధులు ఈసమావేశంలో సత్పాల్‌సింగ్,బచ్చన్‌సింగ్, చరణ్‌సింగ్, రవీందర్ సింగ్,సురేందర్‌సింగ్, రణ్‌బీర్‌సింగ్,ఇంద్రజీత్‌సింగ్‌లు పాల్గొన్నారు

## కంటోన్మెంట్‌కు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసింది : ఎమ్మెల్యే శ్రీగణేష్



విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదిరులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 28 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఉన్న యాబై కంటోన్మెంట్ బోర్డుకు కేంద్ర రక్షణ శాఖ 304.62 కోట్ల గ్రాంట్ ఇన్ ఏడ్ 2025 - 26 కు కెటాయించిందని, అయితే దేశంలో అతి పెద్ద సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు కేవలం 2.82 కోట్లు కెటాయించడం సరైంది కాదని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ జనాభా 2.25 లక్షల జనాభా ఉండగా ప్రస్తుతం 4.50 లక్షలకుపైగా జనాభా నివసిస్తున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు రూ.2.82 కోట్లు కెటాయించడం అవమానకరమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణలో ఉన్న ఏకైకా కంటోన్మెంట్‌పై సవతి ప్రేమ చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక మాసంలో పూజలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి



6వ వార్డు సీతారామ్‌పురం హన్‌మాన్ ఆలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్, పాండు యాదవ్ తదితరులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 28 ప్రభాతవార్త:** కార్తీక మాసం పూజలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, మాజీ బోర్డు మెంబర్ పాండు యావద్‌లు తెలిపారు. 6వ వార్డులోని సీతారామ్‌పురం శివపంచాయతన హన్‌మాన్ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ కార్తీక మాసంలో అకాశ దీపం వెల్లడతీయడం ఎంతో విశిష్టమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సాయిబాబా యాదవ్, ప్రతినిధులు విజయ్ కుమార్, మనోహర్,శ్రీకాంత్‌రెడ్డి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పైకి వాలిన చెట్టు

-పాములు వస్తున్నాయంటూ స్థానికులు భయాందోళన



ఇళ్ల పైకి వచ్చిన చెట్టు.

**బేగంపేట అక్టోబరు 28,ప్రభాతవార్త**

బేగంపేట డివిజన్ పరిధిలోని శ్యాంలాల్ బిల్డింగ్ తాతాచారి కాలనీ వీధి నెంబరు 1 హైదరాబాద్ పబ్లిక్ స్కూలు ప్రహరీకి అనుకుని ఉండటంతో పాఠశాలలో ఉన్న చెట్టు తమ ఇండ్లపైకి వాలిపోయిందని,దీంతో చెట్టు మీది నుంచి పాములు తరచూ ఇళ్లలోకి వస్తున్నాయంటూ బస్తీ వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.తరచూ పాములు చెట్టుపై నుంచి ఇండ్ల లోకి వస్తున్నాయన్నారు.ఈ ప్రాంతంలో 5 నెలలుగా వీది లైట్లు కూడా పనిచేయడం లేదని,వారు ఆరోపిస్తున్నారు.రాత్రి సమయంలో చిన్నారులు,వృద్దులు,మహిళలు బయటకు రావాలంటే భయంగా ఉందని వారు ఆందోళణ చెందుతున్నారు.సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి ఇళ్ల మీదికి వాలిపోయిన చెట్ల కొమ్మలను వెంటనే కొట్టి వేసి పాములు రాకుండా చర్యలు చేపట్టాలని తాతాచారి కాలనీ బస్తీ వీధి నెంబరు 1 వాసులు కోరుతున్నారు.అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుడికి తప్పిన ప్రమాదం

**హైదరాబాద్ అక్టోబరు 28, ప్రభాతవార్త**

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడికి త్రుటిలో ప్రాణపాయం తప్పింది. రైలు పట్టాలపై పడిపోతున్న ఆ ప్రయాణికుడిని గమనించిన తోటి ప్రయాణికులు, కానిస్టేబుల్స్.. అతన్ని ప్లాట్‌ఫామ్‌పైకి లాగారు. ఈ ప్రమాద ఘటనకు సంబంధించి అక్కడున్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.వరంగల్‌కు చెందిన మణిదీప్ అనే వ్యక్తి బెంగళూరు వెళ్లేందుకు ఈ నెల 26న కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ఇక బెంగళూరు వెళ్లాల్సిన రైలు ఎక్కాల్సి ఉండగా, తొందరలో మరో రైలు ఎక్కాడు. దీంతో ఆ రైలు దిగేందుకు యత్నించగా.. అప్పటికే రైలు వేగంగా ముందుకు కదిలింది. దీంతో మణిదీప్ రైలు చక్రాల కింద పడబోయాడు. గమనించిన తోటి ప్రయాణికులు, ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ అప్రమత్తమైన అతడిని పక్కకు లాగారు. దీంతో మణిదీప్ ప్రాణాలతో బయటపడ్డాడు.

## తెలంగాణలో నాలుగవ స్థంభంగా ప్రజారాజ్యం పార్టీ : రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జిలుకర రవికుమార్

**ముషీరాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అనే మూడు స్థంభాలు మాత్రమే ఉన్నాయని, ఇకపై ప్రజారాజ్యం పార్టీ నాలుగవ స్థంభంగా తెలంగాణలో ఎదుగుతుందని, ఇకపై తెలంగాణ ప్రజలు నాలుగుస్థంభాలాట చూడబోతున్నారని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జిలుకర రవికుమార్ అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విశ్రాంత ఐఎఎస్ అధికారి కూనపురెడ్డి హరిప్రసాద్‌తో కలిసి, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయటమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలుచేయటంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమయిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో అభివృద్ధిని విస్మరించి, అవినీతి, అక్రమాలను పెంచి పోషించారని, బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ, రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధిచెప్పి, అవినీతి రహిత తెలంగాణ నిర్మాణమే ధ్యేయంగా ప్రజల ముందుకు వచ్చామని పేర్కొన్నారు. ప్రజారాజ్యం పార్టీ సిద్ధాంతాలు నచ్చి, అనేక మంది పార్టీలో చేరేందుకు ముందుకు రావటం శుభపరిణామమని, పార్టీలో చేరేందుకు యువత కూడా ముందుకురావాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాత్రం తమ పార్టీ పోటీలో ఉండటం లేదు కాబట్టి కాంగ్రెస్ పార్టీకే మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. ఈ సందర్బంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు డాక్టర్ సింగం శ్రీనివాసరావు, మామిళ్ల సురేష్, ప్రొఫెసర్ జలాలుద్దీన్, విజయారెడ్డి, ఉదయ్‌సింగ్, మేకల సారయ్య, ప్రభాకర్, కుమార్, రత్నరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథ నియోజకవర్గంగా గోషామహల్ : గడ్డం శ్రీనివాస్‌యాదవ్



బస్తీ నిద్ర గోడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్

**గోషామహల్,అక్టోబర్ 28 ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గంలో అభివృద్దిన్ని గాలికి వదిలి వేసి వసూలకు పాల్పడుతున్న బిజెపి నుంచి సస్పెండ్ అయిన శాసనసభ్యులు,ఐదు మంది బిజెపి కార్పొరేటర్లు, ఎం.ఐ.ఎం కార్పొరేటర్ బండారం బయట పెడుతానని గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్‌బిఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు.వితలేశ్వర మందిరం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు దఫాలుగా ఉన్న శాసన సభ్యులు,ఐదు మంది బిజెపి కార్పొరేటర్లు కూడా గోషామహల్ నియోజకవర్గంలో ఏమాత్రం అబివృద్ధి కోసం పట్టించు కోవడంలేదని దుయ్యబట్టారు.ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నప్పటికిఅభివృద్దిలో మాత్రం గోషామహల్ నియోజకవర్గం అనాథ నియోజకవర్గంగా మారిందన్నారు.రాత్రివేళ్లలో విద్యుత్ దీపాలు వెలుగక పోవడంతో అంధకారంగా మారిందన్నారు.దీనికి తోడు అధ్వాన్నమైన రహదారులు,పొంగిపొర్లుతున్న మురుకు నీరు.కలుషీత మంచినీటి సరఫరా అరి కట్టడంలో పూర్తిగా విఫలం చెందినట్లు చెప్పారు.గోషామహల్ నియోజకవర్గంలో చివరకు దేవుళ్ల స్థలాలు,ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నట్లు దుయ్యబట్టారు.ప్రతి డివిజన్‌లోని బస్తీనిద్ర కార్యక్రమంలో ప్రజా సమస్యలను సేకరించి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం కోసం పాటు పడుతామన్నారు.గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ద్వారా గోషామహల్ నియోజకవర్గం ప్రజలను ఓటు విలువతోపాటు పాలకులను,అధికారులను ప్రశ్నించే తత్వాన్ని నేర్పిస్తామన్నారు.ఫౌండేషన్ ద్వారా ఉచిత విద్య,జాబ్ మేళాను ఏర్పాటు చేసి యువత,యువకులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో జి.జి.ఎఫ్ ప్రతినిధులు మహేష్‌గౌడ్,శ్రీనివాస్‌యాదవ్,జగదీష్ గుప్త,దిగంబర్,మేఘనాయక్,అమర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిఈఓకు అభినందనలు వెల్లువ



కంటోన్మెంట్ నూతన సిఈఓకు అభినందనలు తలుపుతున్న మాదిగ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 28 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు నూతన సిఈఓగా బాధ్యతలు స్వీకరించిన అరవింద్ ద్వివేదిని మంగళవారం కంటోన్మెంట్ మాదిగల వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్బంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నెలకొన్న రోడ్లు,డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని సిఈఓకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఇటు గోపి మాదిగ, ఏ.ఎల్. ఆనంద్ మాదిగ, రొట్టెల సునీల్ మాదిగ, నాగరాజు,వెంకట్ రావ్, విజయ్,రాఖేశ్, బాబు మాదిగ, శేఖర్ మాదిగ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## పేదలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట,అక్టోబర్ 28 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం కోసం సిఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. బోయిన్‌పల్లి కంపసరి బజార్‌కు చెందిన ఎల్.బిన్. అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్ఆసుపత్రిలో వైద్య పరీక్షల నిమిత్తం మంజూరైన రూ.2 లక్షల ఎల్ఓసీని మంగళవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యం పట్ల సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, అత్యున్నత ప్రమాణాలతో ప్రభుత్వ ఆసుపత్రులను నెలకొల్పడం జరుగుతుందన్నారు.

## విద్యార్థినులపై అటెండర్ చేసిన ప్రవర్తనను ఖండించిన నేరెళ్ల శారద

**బేగంపేట అక్టోబరు 28,ప్రభాతవార్త**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై అటెండర్ చేసిన అనుచిత ప్రవర్తనను తెలంగానా రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద తీవ్రంగా ఖండించారు.విద్యా సంస్థల్లో చదువుకునే బాలికల భద్రత,గౌరవం పట్ల నిర్లక్ష్యాన్ని,ఏ రూపంలోనూ సహించబోమని చైర్ పర్సన్ స్పష్టం చేసారు.ఈ మేరకు కమీషన్ చైర్ పర్సన్ జిల్లా కలెక్టర్ ,జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసి విషయంపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యాసంస్థలు ,విద్యార్థినుల భవిష్యత్ నిర్మాణంలో కీలకమైనవని,అవి స్వేచ్ఛాయుత,సురక్షిత ,గౌరవ ప్రదమైన వాతావరణంలో ఉండాలని,విద్యార్థినులపై ఎలాంటి వేధింపులు అనుచిత ప్రవర్తనను ఏ పరిస్థితుల్లో సహించబోమని చైర్ పర్సన్ స్పష్టం చేసారు.భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించేందుకు జిల్లా యంత్రాంగం కాలేజీలు, విద్యా సంస్థలు హాస్టళ్లలో తనిఖీలు చేపట్టి భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.ఈ కేసు పురోగతిని మహిళా కమీషన్ పర్యవేక్షిస్తామని,బాధిత విద్యార్థినులకు అన్ని విధాల సహకారం అందిస్తామని చైర్ పర్సన్ నేరెళ్ల శారద ఒక ప్రకటనలో హామీ ఇచ్చారు.

## సంతోష్‌నగర్‌లో నాలాలో పసికందు మృతదేహం

**సైదాబాద్, అక్టోబరు 28 ప్రభాతవార్త:** సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని దాదాపు ఒక నెల వయస్సున్న పసికందు మృత దేహం లభ్యమైంది. వివరాలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుంధతినగర్‌లోని నాలాలో ఒక కవర్‌లో పసికందు (ఆడపిల్ల) మృతదేహం పడిఉందన్న సమాచారంతో సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. నాలా నుండి పసికందు మృతదేహాన్ని పోలీసులు బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## పర్యావరణ పరిరక్షణ సుస్థిరతపై అవగాహన



పర్యావరణ పరిరక్షణ సుస్థిరతపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి.

**బేగంపేట అక్టోబరు 28,ప్రభాతవార్త**

బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ సుస్థిరత పై అవగాహన సమావేశం నిర్వహించారు.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట స్వప్నిక రేహా ఫౌండేషన్ ,జన విజ్ఞాన వేదిక ,కార్యా ఫౌండేషన్ సౌజన్యంతో జువాలజీ డిపార్ట్‌మెంట్ విధ్యార్దులకు పర్యావరణ పరిరక్షణ సుస్థిరత అనే అంశంపై 15రోజులు (ప్రతి రోజు 2గంటలు చొప్పున) సర్టిఫికెట్ కోర్సు ఈ నెల 7వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వివిధ విషయాలపై దేశీయ,అంతర్జాతీయ నిష్ణాతులతో తరగతులు నిర్వహించి వారికి సర్టిఫికెట్ ప్రధానం చేసారు.ఈ సందర్బంగా అక్టోబరు 24,27తేదీలలో ఎన్విరాన్‌మెంట్ పొల్యూషన్ పిల్లల బాధ్యత క్షేత్ర స్థాయి ప్రాజెక్టులు అనే అంశంలో వివిధ విషయాలపై విధ్యార్దులు వారి ప్రాజెక్టులపై ప్రజెంటేషన్లు ఇచ్చారు.అంతర్జాతీయ నిపుణులు సురక్ష (యూఎస్ఏ) సంస్థ ఆద్యులు డా.పి.నారాయణరావు అడ్వకేట్ టి.మహాలక్ష్మి ఆర్.కన్నన్, జి.కొండలరావు, ఎన్.హరనాథ్‌బాబు ఎస్ఎమ్ఈ సంస్థ సభ్యులు సీహెచ్ రంగారెడ్డి సమీక్షించి విద్యార్దులకు అవార్డులు అందించి సర్టిఫికెట్లు పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మావతి,జువాలజీ హెడ్ డా.జీఎస్ జ్యోతిర్మయి,హెల్త్‌క్లబ్ కన్వీనర్ డా.పి.ఎస్.రజనీ,ప్యాకల్టీలు డా.డి.ప్రసన్న,అంకితలు ప్రసంగించి విద్యార్థినులను ఉత్తేజపరిచారు.ఈ సందర్బంగా పర్యావరణ పరిరక్షణ సుస్థిరాభివృద్ధి అనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి తాము కూడా శాయశక్తులా కృషి చేసి పర్యావరణాన్ని భావి తరాల భవిష్యత్‌ను దేశాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేసారు.

## సంక్షేమ సంఘాలు అభివృద్ధిపై దృష్టి సారించాలి



సంఘం సభ్యులను అభినందిస్తున్న ప్రేమ్ కుమార్

**కూకట్‌పల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త :** సంక్షేమ సంఘాలు స్థానిక అభివృద్ధిపై దృష్టి సారించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ఉమారెడ్డి ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. ఏ.వి.పురం కాలనీ స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన సంక్షేమ సంఘం జనసేన నాయకులను ప్రేమ అభినందనలు తెలియజేశారు. సంక్షేమ సంఘం ప్రెసిడెంట్‌గా జనసేన పార్టీకి చెందిన పెద్దింటి సింహాద్రి, జనరల్ సెక్రటరీగా కలమట వెంకటరావు ఘన విజయం సాధించిన శుభ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్‌ని వారి నివాసంలో కలిసారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ఈ విజయం కేవలం వ్యక్తిగత గెలుపు మాత్రమే కాదనీ ప్రజల విశ్వాసానికి ప్రతీకనీ ప్రజలతో ఎల్లప్పుడూ సన్నిహితంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం కృషి చేయడం ద్వారా మాత్రమే మనం నిజమైన ప్రజా సేవకులమవుతాం అని తెలిపారు. అనంతరం విజయం సాధించిన నేతలకు శాలువాలతో సన్మానిస్తూ భవిష్యత్తులో మరింత బలంగా ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు జనసేన నాయకులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని 18.వ,వార్డుకు చెందిన వెంకటేశ్వర్లుకు రూ.60.వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్. చిత్రంలో కాంగ్రెస్ నేతలు సురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్‌లు.

## 42శాతం రిజర్వేషన్లలో మేమెంతో మాకంత వాటా కేటాయించాలి : సుధాకర్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోగికార్ సుధాకర్

**ముషీరాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అమలుచేయాలని చూస్తున్న 42శాతం రిజర్వేషన్లలో ఎంబీసీల జనాభా నిష్పత్తి ప్రకారం మేమెంతో మాకంత వాటా కేటాయించాలని ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోగికార్ సుధాకర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో అరెకటిక పోరాట సమితి, అఖిల భారత విశ్వకర్మ పరిషత్, విశ్వకర్మ హక్కుల సాధన సమితి, డినోటిఫయిడ్ ట్రైబస్, తెలంగాన యునైటెడ్ ఫ్రంట్, వంశరాజ్, రజక, తెలంగాణ మాదిగ దండోరా, బహుజన ముక్తి పార్టీ, నాయి బ్రాహ్మణసంఘం, కార్మిక హక్కుల పోరాట సమితి, తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ, ఆమ్‌ద్మీ పార్టీ, సామాజిక తెలంగాణ పార్టీ నేతలు, ప్రజాసంఘాల నేతలతో కలసి సుధాకర అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42శాతం రిజర్వేషన్ల అమలుకోసం బీసీ, ఎంబీసీ, డిఎన్‌టి సంఘాలు కార్యాచరణతో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం బిసి రిజర్వేషన్లలో పార్టీ పరంగా మా ఎంబీసీలకు ఎంత శాతం కేటాయిస్తారో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేయాలని కోరారు. బీసీ కులాలలో కొన్ని కులాలు మాత్రమే రిజర్వేషన్ల ఫలితాలు అందుకుని, కొంత మెరుగైన స్థితిలో ఉన్నారని, అత్యధిక జనాభా కలిగిన అత్యల్ప కులాలమైన ఎంబీసీలం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో అణచివేతకు, నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురై ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులలో మేమెంతో మాకంత వాటా అనే డిమాండ్‌పై అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు, అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరి తెలియచేయాలని కోరారు. 42శాతం రిజర్వేషన్‌ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి, చట్టభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మోహన్ బైరాగి, చింతాస్వామి, మన్నారం నాగరాజు, వేణుగోపాల్, సత్తార్, జావీద్, ప్రఫుల్‌రామిరెడ్డి, వీరాచారి, వేణుగోపాల్‌చారి, సోమాచారి, వెంకటాచారి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేటలో పడకేసిన పారిశుధ్యం..

**ఎక్కడ చూసినా చెత్తా చెదారమే**

**రోగాల బారిన ప్రజలు.పట్టించుకోని అధికారులు**



ప్రకాశం నగర్ పాత రిజిస్ట్రేషన్ ఆఫీసు మార్గంలో రోడ్డుపై పేరుకున్న చెత్త.

**బేగంపేట అక్టోబరు 28,ప్రభాతవార్త**

బేగంపేట డివిజన్ లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది.ఎక్కడ చూసినా చెత్తా చెదారమే కన్పిస్తుంది.దీంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి.పరిసరాలు ఇలా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.చెత్త కుప్పలు డివిజన్ పరిధిలోని ప్రకాశం నగర్ ఓల్డ్ రిజిస్ట్రేషన్‌కు ఆఫీసుకు వెళ్లే దారిలో ఇలా చెత్త కుప్పలు దర్శనమిస్తుండటంపై స్థానికంగా ఉన్న మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ లో చెత్త పేరుకు పోయి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో ఆ మార్గంలో ముక్కు మూసుకోకుండా నడవలేని పరిస్థితి. అలాగే ఫతేనగర్ లింక్‌రోడ్డు,ధనియాల గుట్ట శ్మశాన వాటిక రోడ్డులో చెత్త కుప్పలు కొండల్లా పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.అలాగే శ్యాంలాల్ బిల్డింగ్‌లో వరుణ్ మోటార్స్ వర్క్‌షాపు దాటిన తర్వాత ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీ నివాసాల ముందు కూడా చెత్త కుప్పలు పెద్ద ఎత్తున పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పాటిగడ్డ రోడ్డులో కూడా చెత్త కుప్పలు పేరుకు పోయాయని,స్థానికులు ఆరోపిస్తున్నారు. అల్లంతోట బాయి రామాలయం ముందు కూడా చెత్త కుప్పలు పేరుకు పోయి వర్షం కురిసిన సమయంలో అవి అన్నీ రామాలయం ముందుకు చేరుకుంటున్నాయని,తీవ్ర దుర్వాసన వస్తుందని భక్తులు ఆరోపిస్తున్నారు.అలాగే ప్రధాన రోడ్డు వెంట ఏర్పాటు చేసిన చెత్త కుండీలు కూడా నిండిపోయి ఉన్నా పారిశుధ్య శాఖ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.ముఖ్యంగా ధనియాలగుట్టశ్మశాన వాటిక రోడ్డులో చెత్త కుప్పలను తొలగించి రోడ్డు వెంట మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు బేగంపేట లో పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు పై బస్తీల ప్రజలు కోరుతున్నారు.

## పక్షవాతంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలి

**ముషీరాబాద్ యూపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి**

**ముషీరాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** పక్షవాతం వల్ల కలిగే నష్టాలను అరికట్టాలంటే, పక్షవాతంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి సూచించారు. అక్టోబర్ 29న ప్రపంచ స్ట్రోక్‌డే సందర్భంగా శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇటీవల కాలంలో అనేక మంది పక్షవాతంకు గురవటం ఆందోళన కలిగిస్తోందని, అందుకే దీనిపై అవగాహన కలిగించేందుకే స్ట్రోక్‌డే జరుపుకుంటున్నామని తెలిపారు. మెదడులోని రక్తనాళాలు పూడుకుపోయినా, పగిలిపోయినా, మెదడులోని ధమనులు, సిరల్లో రక్త ప్రసరణకు ఆటంకాలుంటే బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని, పోషకాహారం తీసుకుంటూ, జీవన విధానం మార్చుకుంటే ఈ స్ట్రోక్‌ను నివారించవచ్చునని అన్నారు. అకస్మాత్తుగా ముఖం, చేయి, కాలులో తిమ్మిర్లు, లేదా బలహీనంగా అనిపించటం, మాట్లాడటంలో ఇబ్బంది, కంటి చూపులో ఇబ్బంది, సరిగ్గా నడవలేకపోవటం, విపరీతమైన తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వీలైనంత త్వరగా వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలని సూచించారు.బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు అశ్రద్ధ వహిస్తే ఆ వ్యక్తి జీవితాంతం ఇబ్బందులు పడవలసి వస్తుందని, ఒక్కోసారి ప్రాణాలు కూడా పోయే ప్రమాదం కూడా ఉంటుందని హెచ్చరించారు.

## రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా "బిసి సంక్షేమ సమితి "



బిసి సంక్షేమసమితి లోగో ఆవిష్కరిస్తున్న మహేష్ ముదిరాజ్, చెన్నరాములు, గణేష్‌యాదవ్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 28,ప్రభాతవార్త:** జనాభా దామాషా ప్రకారం బిసిరిజర్వేషన్లు సాధించడమే లక్ష్యమని ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకరబోయిన మహేష్ ముదిరాజ్ అన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో బడుగు బలహీన వర్గాలకు విద్యా ఉద్యోగ మరియు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ సాధించడమే లక్ష్యంగా "బీసీ సంక్షేమ సమితి" నూతన సంఘము లోగోను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారె డ్డి డిక్లెషన్‌లో ముదిరాజులకు ఇచ్చినటువంటి హామీలను వెంటనే నెరవేర్చా లన్నారు. అలాగే ముదిరాజ్ కార్పొరేషన్ కి 1000 కోట్ల నిధులు కేటాయిం చాలి, నామినేట్ పదవుల్లో ముదిరాజులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ డిసిసి పదవుల్లో ఏడు జిల్లాలకు ముదిరాజులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిరాజ్ బిడ్డకు కేటాయించాన్నారు. జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసిన నవీన్ యాదవ్‌కి ముదిరాజ్ పోరాట సమితి మద్దతు తెలుపుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కేశబోయిన శేఖర్ జనరల్ సెక్రెటరీ, చెన్న రాములు, బూరం గణేష్ యాదవ్, జోగని రవి తదితరులు పాల్గొన్నారు

## జుబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కి సూపర్ స్టార్ కృష్ణ మహేష్ సేన మద్దతు

**హైదరాబాద్ అక్టోబరు 28, ప్రభాతవార్త**

జుబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సూపర్ స్టార్ కృష్ణ మహేష్ సేన మద్దతు ప్రకటించింది.మంగళవారం బర్కత్‌పురలోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని సేన జాతీయ అధ్యక్షుడు దిడ్డి రాంబాబు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషిలో భాగంగా ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ నవీన్‌యాదవ్ గెలుపుకు సూపర్ స్టార్ కృష్ణ మహేష్ సేన పాటు ఉందని చెప్పారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో తమ సేన తరపున ఇంటింటి ప్రచారం ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. తమ సేన సభ్యులు జూబ్లీహిల్స్‌లోని అన్ని డివిజన్లలో ఇంటింటికి వెళ్లి సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను తెలియజేసి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఓటర్లను కలిసి కోరనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే జూబ్లీ హిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయని ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. టిఆర్ఎస్ బిజెపికి ఓటు ఓటు వృధా అవుతుందని ఓటర్లకు తెలి యజేస్తామని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సూపర్ స్టార్ కృష్ణ మహేష్ సేనకు సంబంధించి పదివేల మందికిపైగా అభిమాన సభ్యులు ఉన్నారని,అందరూ ఈ ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. సేన నాయకులు ఎన్.ఎస్. కే.రాజు, యశ్వంత్, వెంకటేష్ యాదవ్,రాజిరెడ్డి,రామకృష్ణగౌడ్, తోట రంగారావు తదితరు పాల్గొన్నారు.

## చిక్కా రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ పురస్కారాల ప్రధానం



**చిక్కడపల్లి అక్టోబర్ 28 ప్రభాతవార్త:** సాహిత్య రత్న చిక్కా రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ పురస్కారాల ప్రధానోత్సవం త్యాగరాయ గానసభలో జరిగింది.శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న అతిథులుగా పాల్గొన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు బింగి నరేందర్ గౌడ్ చిక్కా రవికిరణ్ (అధ్యక్షులు) చిక్కా దేవదాసు, చిక్కా శంకర్, చిక్కా శ్రీనివాస్ కార్యక్రమాన్ని సమన్వయము చేశారు.అశోక్ కుమార్ హీరావత్, కే.శ్రీనివాస్ రావు, డేవిడ్ రాజు లను సత్కరించారు. కళాకారులను గాయనీ గాయకులను రచయితలను, జర్నలిస్ట్ లకు పురస్కారాలు ఇచ్చారు. చంద్ర శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్బంగా సినీ సంగీత విభవారి ఉల్లాసంగా జరిగింది.


**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client Sr Devesh Dhar Dwivedi, S/o. Sri K. N. D. Dwivedi, Aged 44 years, Occ: Manager, R/o. Flat No. 105, 1st Floor, Utopia D, Casa Paradiso apartments, Sanath Nagar, Hyderabad, was in the custody of all the original documents relating to her Flat No. B 303, in Jains Carlton Creek apartments constructed by M/s Jains housing finance limited as Developer, in Khajaguda Village, Serilimgampally Mandal, Ranga Reddy district, in Telangana, but the **Original Registered Sale Deed bearing document No. 1574/2021 Dated 20-01-2021 which stands on the name of myclient (containing Cover)** has been lost/mis placed by her while shifting his House on 15-12-2021 and to that effect my client also taking necessary legal steps to that effect.

If any person or person(s) who came across the custody of the said **Original Registered Sale Deed bearing document No.1574/2021 Dated 20-01-2021 (containing Cover),** pertains to the said Plot be pleased to hand-over to the undersigned or to my client.

Sd/- **Savithri Sravanthi**
Advocate
504, Mahalaxmi Paradise Road no 3, West Marredpally, Secunderabad 500026
**Ph.No.98496 66553**



తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
కొటేషన్లు పొందేందుకు ప్రకటన

ప్రకటన నం.**07/EE-29/SDZ/GHMC/2025-2026,** తేది: **28.10.2025**
క్ర.సం.1. క్రింద పేర్కొన్న ఐటమ్‌ల కొరకు వృత్తిదారులు/అధీకృత డీలర్లు/ఏజెన్సీలు వగైరా నుండి సీలు కొటేషన్లు కోరబడుచున్నవి. ఇంజనీర్-ఇన్‌చార్జి ప్రత్యక్షంగా రవాణా యొక్క ధర కలిపి వగైరా సికింద్రాబాద్, సర్కిల్-29లో క్యాచ్‌పిట్ మరమ్మతులు, పాత్‌హోల్స్ ప్యాచెస్ చేయడానికి రోడ్డు నిర్వహణ పనులకు సీలు కొటేషన్లు కోరబడుతున్నవి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది, సమయం/బిడ్ దాఖలు ముగింపు తేది, సమయం: 29.10.2025, మ.12.00గం. 01.11.2025, మ.12.00గం. అధికారి పేరు, చిరునామా మరియు సెల్ నం.: సీలు కొటేషన్లు 01.11.2025 మ.12.00గం. లేదా ఆలోగా సికింద్రాబాద్, GHMC, సర్కిల్29. ఇ.ఇ. కార్యాలయంలో దాఖలు చేయవచ్చును. సెల్ నం. 9704405076. సంబంధిత ఇ.ఇ. చిరునామా పైన పేర్కొనబడినది. తదుపరి వివరాలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-29, సికింద్రాబాద్ జోన్, GHMC (సిటీ సివిల్ కోర్ట్ ఎదురుగా, వెస్ట్ మారేడ్‌పల్లి - 500026) నుండి పొందవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-29, సికింద్రాబాద్.
**DIPR.NO.9848-PP/CL/ADVT/1/2025-26 తేది: 28.10.2025**

